క్లుప్తంగా

శాలిహుండం యాత్రకు పటిష్ట బందోబస్తు



కొండపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

గార: ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి సందర్భంగా జరిగే శాలిహుండం గిరియాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. కొండపై వేణుగోపాలస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, క్యూలైన్లను శుక్రవారం పరిశీలించారు. అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి నుంచి వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. వంశధారలో చక్రతీర్థ స్నానానికి వెళ్లే సమయంలో రోప్ పార్టీ విషయమై చర్చించారు. మధ్యాహ్నం 3 తర్వాత పోలీసులు ఉండటం లేదని చెప్పగా.. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. కొండపైకి వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఎం.మధుసూదనరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు



రాజరాజేశ్వరునికి హారతులిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ లలిత మహాత్రిపుర సుందరి దేవి పీఠంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ నేతృత్వంలో స్వామివారి మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ వాశిష్ట కార్తికేయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబాకు శాంతి హోమ పూజలు



హోమాలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలోని వంద అడుగుల వెంకటి సాయికోటి, నాగసాయి మహాస్తూపం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఐదు గంటల నుంచి బాబాకు సత్యవ్రతాలు, సాయి శాంతి హోమ పూజలు నిర్వహించారు. పూజ్యగురువులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ నిర్మాత మక్క వెంకటిసాయి పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దు లక్ష్మణరావు ఇటీవల ప్రమాదంలో గాయపడి కోలుకున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, నాయకులు బస్వ గురుగుబాబు, అంబటి రాంబాబు, మహంతయ్య, సూరాడ రాము ఉన్నారు.

మిత్ర పురుగుల సంరక్షణే కీలకం



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బగ్గు రజిని

గార: మిత్ర పురుగుల సంరక్షణ వల్ల పైరుకు రక్షణ ఏర్పడుతుందని శ్రీకాకుళం వ్యవసాయ సహాయ సంచాలకులు బగ్గు రజిని అన్నారు. శుక్రవారం తోనంగి పంచాయతీలో పెసర పైరువద్ద డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిత్ర పురుగులు, తెగుళ్లు, కలుపు మొక్కలను గమనించాలని, మిత్ర పురుగుల కంటే తెగుళ్ల వ్యాప్తి ఎక్కువ ఉంటేనే క్రిమిసంహారక మందులు వాడాలని సూచించారు. అనంతరం రైతులకు 50 శాతం రాయితీపై వేపనూనె అందజేశారు. కార్యక్రమంలో గార ఏఓ దుంపల పద్మావతి, ఏఈవో పాగోటి సుధారాణి, వీఏఏ శిరీష పాల్గొన్నారు.

నేడు ఎస్‌సీపీసీఆర్ సభ్యుడు సీతారాం పర్యటన

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం శనివారం జిల్లాలో పర్యటించి ప్రభుత్వ మోడల్ స్కూళ్లు, కేజీబీవీలను సందర్శించనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని కమిషన్ కార్యాలయ కార్యదర్శి టి.వి.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు.

విపక్షాలది విష ప్రచారం



ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

- సుపరిపాలనకే పట్టం కట్టండి
- గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యం
- సంక్షేమమే సర్కారు లక్ష్యం
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ సుపరిపాలనను ప్రజలు బేరీజు వేసుకొని మంచి పాలన అందించే ప్రభుత్వానికి పట్టం కట్టాలని, నమ్మించి మోసం చేసేవారిని వెనక్కి పెట్టాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, సర్పంచ్ గేదేల చెంగల్వరావు అధ్యక్షతన రాగోలులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో ధర్మాన మాట్లాడారు. జీవన ప్రమాణాల పెంపుదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. విపక్షాలు అభివృద్ధి లేదంటూ విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం నిర్దేశించిన హక్కుల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు. కరోనా సమయంలోనూ వలంటీర్ వ్యవస్థ నిరంతరాయంగా సంక్షేమ పథకాలు, సరుకులు చేరవేశామని గుర్తు చేశారు.

సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, నాడు-నేడులో పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధిని విపక్షాలు పరిశీలించాలన్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ఒకప్పుడు ఏదైనా కేసు వస్తే రిఫర్ టు వైజాగ్ అనేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వంశధార నీటిని వినియోగించుకునేందుకు గొట్టా వద్ద 19 టీఎంసీల నీటిని ఎత్తి పోసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దీని ద్వారా ముందు వేసవిలో కూడా రైతులకు నీరు అందించే వీలు కలుగుతుందన్నారు.

వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాగోలు గ్రామానికి రూ.15 కోట్ల సంక్షేమ పథకాలు అందించామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి చేశాం కాబట్టే ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదంటూ హైదరాబాద్‌లో కొన్ని సరుకులు, శ్రీకాకుళంలో కొన్ని సరుకుల మధ్య వ్యత్యాసాన్ని చూపించారు. అనంతరం పేదలకు ధర్మాన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీఓ రఘు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు చల్లా రవికుమార్, బోర చిన్నంనాయుడు, అల్లు లక్ష్మీనారాయణ, పైడి మహేశ్వరరావు, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, లోలుగు శ్రీనివాసరావు, పొన్నాన కూర్మారావు, యజ్జల గురుమూర్తి, బగ్గు అప్పారావు, రుప్ప అప్పలసూరి, బొబ్బాది చంద్రమౌళి, గుండ మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేయడాన్ని ఓర్వలేని చంద్రబాబు, రామోజీలు వలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన కోడికూయక ముందే వృద్ధుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తున్న వలంటీర్లను చూసి ఓర్వలేనితనంతో ఈనాడులో పనికిరాని రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న ప్రజాదరణ టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదన్నారు. టీడీపీ హయాంలో ప్రతి పథకానికి ఓ రేటు పెట్టి జన్మభూమి కమిటీలు దోచుకున్నా ఏనాడూ ఎల్లోమీడియా ఒక్క కథనం కూడా రాలేదన్నారు. వలంటీర్ అంటే స్వచ్ఛమైన సేవకులని, జన్మభూమి కమిటీల్లా దోచుకుతినే రాబందులు కాదన్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు సారథులుగా ఉంటేవలంటీర్లు వారథులుగా ఉంటారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, కనపల తేజ, సీపాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాడు సామూహిక గృహ ప్రవేశాలు

- మండల ప్రత్యేకాధికారిణి అనూరాధ



సమావేశంలో మాట్లాడుతున్న అనూరాధ

లావేరు: జగనన్న కాలనీల్లో ఉగాది పండుగ రోజున సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని.. అందువల్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారిణి అనూరాధ, తహసీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి అన్నారు. లావేరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. మండలంలోని ఏ జగనన్న కాలనీలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, వీటిలో ఎన్ని పూర్తయ్యాయి, నిర్మాణ దశలో ఎన్ని ఉన్నాయి తదితర విషయాలపై ప్రత్యేకాధికారిణి సమీక్ష చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో 1776 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇంతవరకూ 1035 పూర్తయినట్టు పేర్కొన్నారు. మిగతా నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ కె.అప్పలనాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నంనాయుడు తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



సంప్రదాయం బృందం ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: సంప్రదాయం గురుకులం విద్యార్థులు విజయవాడ వద్ద బంటుపల్లిలో శుక్రవారం ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది. కిన్నెరసాని, ధర్మోరక్షతి రక్షిత: కూచిపూడి బ్యాలెట్ ప్రదర్శనలో భాగంగా ప్రదర్శన ఇచ్చినట్లు సంప్రదాయం డైరెక్టర్ స్వాతిసోమనాథ్ తెలిపారు. ప్రకృతి పరిక్షణ, గోవులను రక్షించడం, గిరిజనుల కోసం ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రదర్శనలో సంప్రదాయం టీచర్లు యామిని కాశిరెడ్డి, లీలాకృష్ణ, బలరాం, లోకేశ్వరి, విద్యార్థులు పూర్ణిమ, హేమాంజలి, హేమవల్లి, నవ్య, మహాలక్ష్మీ, ఢిల్లేశ్వరి, డంబు, సాయి ప్రియ, అంజలి పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలి



జేసీకి సమస్య వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పూర్తి దిగుబడిలో 80 శాతం లక్ష్యం సాధించినప్పటికి రైతుల వద్ద ఉన్న మిగిలిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలులో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జేసీ నవీన్‌కు సమస్య వివరించారు. కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో మిల్లుల కొరత కారణంగా పలాస ఆ పైన దూరపు ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు అనుసంధానం చేయడం వల్లే స్థానిక రైతులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. మిగులు ధాన్యం సేకరణకు స్థానిక మిల్లుల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోంపేట మండలంలోని అన్ని ఆర్‌బీకేలను కంచిలి మండలంలోని అన్ని మిల్లులతో అనుసంధానం చేయాలన్నారు. అనంతరం జేసీ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ శాఖ శుక్రవారం దాడులు చేపట్టింది. దీనిలో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు రాగోలులోని విశాఖ ప్లాంట్‌ను విజిలెన్స్ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, రవి, ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఏఓగా సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ (ఆర్‌జీయూకేటీ) పరిపాలనాధికారి(ఏఓ)గా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ నియమితులయ్యారు. ఈ మేరకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు వెలువరించారు. అయితే ఇంకా విధుల్లో చేరలేదు. మూల్యాంకణ ప్రక్రియలో వెల్లువెత్తున ఆరోపణలు, బీఆర్ఏయూ అధికారులతో విభేదాలు, అధ్యాపకులు, సిబ్బందితో గొడవలు, తదితర ఫిర్యాదుల మేరకు ఇటీవల ప్రిన్సిపాల్‌పై ప్రత్యేక కమిటీలతో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

ఐదుగురు డీఎల్స్‌కు బదిలీ ఉత్తర్వులు..

అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌తో గొడవలకు కారణమయ్యారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు డిగ్రీ లెక్చరర్లను సైతం వేర్వేరు కళాశాలలకు బదిలీ చేస్తు ఉత్తర్వులు వెలువరించారు. ఇందులో శశిభూషణ్(ఇంగ్లీషు)ను పాతపట్నం డిగ్రీ కళాశాలకు, చిన్నారావు (హిస్టరీ)ను సాలూరు, పైడితల్లి (ఎకనామిక్స్)ను పార్వతీపురం, రవిశంకర్ (కెమిస్ట్రీ)ను పాతపట్నం, రామారావు (బోటనీ)ను టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. వీరెవరు ఇంకా విధుల్లో చేరలేదని తెలిసింది.

ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఎండీ మార్కండేయ స్వామికి అందజేస్తున్న భాస్కరరావు

రణస్థలం: రణస్థలం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు కరిమజ్జి భాస్కరరావు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎఫ్ఎస్‌సీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ మార్కండేయ స్వామికి శుక్రవారం అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

పౌరాణిక నటుడు రామారావు మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: పౌరాణిక నటుడు, నంది అవార్డు గ్రహీత చీకటి రామారావు మాస్టారు రాజాంలోని స్వగృహంలో మృతి చెందడంతో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. రాముడు, కృష్ణుడు తదితర పాత్రలను అద్భుతంగా పోషించారని కొనియాడారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సమాఖ్య సభ్యులు పన్నాల నర్సింహమూర్తి, బి.ఎ.మోహనరావు, బి.రామచంద్రదేవ్, కలగ గణేష్‌యాదవ్, చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పి.సత్యవతి, ఐ.రమణారావు, ఆశాలతా ఖాన్, నిక్కు హరిసత్యనారాయణ ఉన్నారు.

పెంట గ్రామంలో పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువలు, వీధుల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తను తొలగించారు. పనులను సర్పంచ్ పున్నాన సోనియా, పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పున్నాన అక్కలనాయుడు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పర్యవేక్షించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. అయితే టీడీపీ వలంటీర్లుగా పని చేస్తున్న ఎల్లో మీడియా యజమానులు వలంటీర్లపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వలంటీర్లంటే ఎల్లోమీడియాకు భయం పట్టుకుందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తున్నారన్నారు. అందుకు వలంటీర్ల సేవలే కారణమని ఇప్పటికే తేటతెల్లమైందని చెప్పారు. అందుకే ఎల్లో మీడియా వారిపై రోత రాతలు రాస్తున్నాయని.. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. తమ పరిపాలనలో లంచం అనే మాటకు ఆస్కారమే లేదని.. దీనికి వలంటీర్ల వ్యవస్థే కారణమని పేర్కొన్నారు. వలంటీర్లు ప్రజల పట్ల బాధ్యతతో, ప్రభుత్వం పట్ల విశ్వాసం, నమ్మకంతో పని చేస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీల మాదిరిగానే వలంటీర్ల వ్యవస్థ కూడా ఉంటుందని ఎల్లో మీడియా యజమానులు భావించినట్లు ఉన్నారన్నారు. అయితే దానికి భిన్నంగా సేవే పరమావధిగా పని చేస్తుండటంతో తట్టుకోలేకపోతున్నారన్నారు. జన్మభూమి కమిటీల అకృత్యాలను ఏ రోజు పచ్చ మీడియా ప్రశ్నించలేదన్నారు. కేవలం నామమాత్రపు పారితోషకంతో గొప్పగా సర్వీసు అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై విషం చిమ్మడం దురదృష్టకరమన్నారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలను దేశం కీర్తించదని, అటువంటి దృశ్యాలు ఎల్లో మీడియా, చంద్రబాబులకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు కావాలంటే రూ. 20 వేలు, రుణం మంజూరు కావాలంటే రూ. 10 వేలు, మరుగుదొడ్డి కావాలంటే రూ. 1500 లంచంగా ఇవ్వాల్సి వచ్చేదని అప్పట్లో ప్రజలే బహిరంగంగా మాట్లాడుకునేవారని గుర్తు చేశారు. వలంటీర్ల సేవలను ప్రజలకు కావాలనుకుంటున్నారు. పచ్చమీడియా వారిపై ఎన్ని విమర్శలు చేసిన పట్టించుకునే స్థితిలో ప్రజలు లేరన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జి.సిగడాం: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే గృహ సారథుల లక్ష్యమని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. ఆనందపురం సచివాలయం పరిధిలోని గృహ సారథులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ మేలు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామన్నారు. వీటిని మరింత పటిష్ఠం చేసేందుకు గృహ సారథులను నియమిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, మండల జేఏసీ కన్వీనర్ డోల వెంకటరమణ, బాలి అప్పలసూరి, సర్పంచ్‌లు చిత్తిరి మోహన్, వడిశ మహేశ్వరరావు ఉన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న యశోద

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామీణ ప్రాంతాల్లో బాలికా విద్యను ప్రోత్సహించాలని స్త్రీశిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ పి.యశోద అన్నారు. పొన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన వయస్సుల్లో వివాహం చేయాలని, మహిళలను విద్యలో ప్రోత్సహించి వారి ఆర్థిక ప్రగతికి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను విద్య, ఇతర ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. బాలికలు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మైనర్లు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తల్లిదండ్రుల దృష్టిలో పెట్టాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమ్మాజి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం



యర్రవరంలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- యర్రవరం సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం కనిపిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. యర్రవరం గ్రామ సచివాలయ పరిధిలోని కుమ్మరిపేట, యర్రవరం, చినయామలపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 306 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమకూరిన లబ్ధికి సంబంధించిన జాబితాను చదివి వినిపించారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్పందిస్తూ కాలువలు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రవరం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో కాలువల నిర్మాణంతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెప్పలవలస పంచాయతీలోని కొత్తపేట గ్రామానికి చెందిన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిల్ల వర్షిణి రెడ్డి, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, లంకలపల్లి ప్రసాద్, పైడి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, యర్రవరం సర్పంచ్ బోనేల అప్పయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బోనెల చిన్న చంద్రశేఖర్, గ్రామ నాయకులు బిక్కవోలు వెంకటరమణ, అయ్యప్పరమణ, వీరవరపు కనకరాజు, అల్లాడ నాగేశ్వరరావు, అరసవల్లి సత్యనారయణ, యమాల పాపుడు, సుంకు సూర్యనారయణ, యామల క్రిష్ణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: బలగ నుంచి సిద్ధిపేట వరకూ నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 1.8 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.44లక్షలు మంజూరయ్యాయని, పనులను నాణ్యత ప్రమాణాలతో చేయించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రోడ్డు విస్తరణలో భాగంగా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రోడ్డు బాగుంటే పంట పొలాలకు దారి కూడా సులువవుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు ఎస్ఈఎస్ క్రాంతిమతి, గణపతిరావు, పార్టీ సీనియర్ నాయకులు అల్లు లక్ష్మీనారాయణ, సాధు వైకుంఠరావు, రెడ్డి చిరంజీవులు, బలగ గణపతి పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు స్థలం కేటాయించాలని వినతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర పాలక సంస్థ పరిధిలో నివాసం ఉంటున్న అరసవల్లి పరిసర ప్రాంత వాసులకు ఆహ్లాదం, క్రీడలు కరువయ్యాయని, ప్రభుత్వం స్పందించి పార్కు, ఆటస్థలం నిర్మాణానికి స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ కమిషనర్‌లకు స్థానికుల తరఫున వైఎస్సార్ సీపీ నాయకులు విన్నవించారు. అరసవల్లి నడిబొడ్డున సర్వే నంబర్ 539లో 2.77 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని గుర్తు చేశారు.

భవన నిర్మాణాల పరిశీలన



నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: గ్రామ సచివాలయాల పరిధిలో పక్కా భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో వి.ధనుంజయరావు ఆదేశించారు. తెప్పలవలస గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.